కథా నిలయం
4677
శ్రీకాకుళం

# ప్రేమలేఖలు

"రాశాను ప్రేమలేఖా........."

నీళ్ళ గదిలోనుంచి బిగ్గరగా వినబడుతోంది పాట. నీళ్ళ చప్పుడు పాటకు శ్రుతి వేసినట్టుగా ఉంది.

పేరిందేవమ్మ అటువైపు పనిమీద వచ్చి నిలబడి పోయింది. ఆ పాట అన్ని స్థాయిలతోనూ పాడితేగాని కుసుమ బైటికి రాదనిపించింది. అనిపించట మేమిటి-రోజూ చూస్తూనే ఉంది.

అరగంట తరువాత వచ్చిన కుసుమను చూసి ''ఏం పాటే అది? అంతగా రాగాలు తీస్తున్నావు? కాలేజికి టైం కావటంలేదూ?'' చిరునవ్వుతో హెచ్చరించింది

"బోరు కొట్టకుండా స్నానం చెయ్యాలంటే ఏదో పాట పాడాలిగా బామ్మా?"

''అన్నిటికి బోరు అంటావు ఏమిటే? స్నానం చెయ్యటం భోజనం చెయ్యటం కూడా బోరేనా?''

"ఒక విధంగా అంతే. అందుకే భోజనం చేసేటప్పుడు నవలలు చదువుతాను"

"బాగుంది నీ వరస. పెద్దదానవయిన తరువాత ఇలా చేశావంటే నా పరువు పోతుంది.''

''కాదు బామ్మా, పాటలు పాడుకుంటూ పనిచేస్తుంటే, చేసినట్టే ఉండదు-హుషారుగా ఉంటుందని నీవే అంటావుగా?"

"నా పాఠం నాకే ఒప్ప చెప్తావా? నేను చెప్పింది నీళ్ళగదిలోనూ భోజనం చేసేటప్పుడూ చెయ్యమనా? తరువాత తొందరపడతావు తొందరగా తలదువ్వుకుని భోజనానికిరా"

''క్షణంలో తలదువ్వుకుని వచ్చేస్తాను. చాలా రాత పని కూడా ఉంది. సాయంత్రం వచ్చిన తరువాత రాసుకుంటాలే"

గంటలోపల కుసుమ కూనిరాగాలు తీస్తు బయలుదేరింది

తలుపు గొళ్లెం పెట్టి ఎక్కడో దూరాన ఉన్న కొడుక్కి ఉత్తరం రాసి ఇల్లంతా ఒకసారి సర్దుకుని, కుసుమ గదిలోకి వచ్చి, ఆమె పక్క సరిచేసి, బల్ల మీద పుస్తకాలు సర్దటం మొదలు పెట్టింది పేరిందేవమ్మ.

"పిచ్చిపిల్ల పుస్తకాలన్నీ చిందర వందరగా పడేసుకుంది. సమయానికి దొరకలేదని గొడవ చేస్తుంది.'' అంటూ పుస్తకాలన్నీ కిందపడేసి దుమ్ముదులిపి అన్ని వరసగా సర్దింది. కుసుమ నోట్ బుక్కు ఒకచోట పెట్టాలని ఒక్కొక్కటీ దులుపుతూ ఉండగా దారంతో కట్టిన కాగితాలకట్ట ఒకదానిలో నుంచి జారి పడ్డది. ఆ కట్టను ఆ పుస్తకంలోనే పెట్టాలని దులిపి, పెద్ద అక్షరాలుగా కనబడగానే చప్పున ఆమె దృష్టి అటు మళ్లింది.

'ప్రేమలేఖలు' అని పెద్ద అక్షరాలతో రాసి ఎర్రపెన్సిల్‌తో దాని కింద గీత గీసి ఉంది మొదటి పేజీ మీద.

"ప్రేమ లేఖలా?"

"ఈ ప్రేమలేఖలు ఎవరయినా కుసుమకు రాసినవా? లేక కుసుమ ఎవరి కయినా రాసినవా? ఎవరికయినా రాసి వాటి కాపీలు తన దగ్గర పెట్టుకుందా? అట్లా అయి ఉండదు. ఎవరో కుసుమకు రాసినవయి ఉంటాయి. కట్ట కట్టి భద్రంగా పుస్తకంలో పెట్టుకుంది' అనుకుంది మొదట.

కాని- అనుమానం రాగానే పైది తీసి చదివింది.

"ప్రియతమా! నిన్ను చూసినప్పటి నుంచీ ఏదో తీయటి భావం నా మనసులో మెదలుతోంది. ఒక చూపులోనే నా కటువంటి భావం-ఇదివరలో ఎందరిని చూసినా కలగనిది నిన్ను చూడగానే ఎందుకు కలిగిందో నాకే తెలియటం లేదు. కనబడిన వెంటనేమెరుపులా కనుమరుగై పోయావు మళ్ళీ ఎప్పుడైనా కనబడతావా? ఎప్పుడు? ఎక్కడ?

నీ దగ్గర మేగ్నేట్ వంటి వస్తు వేదయినా ఉందా-నా మనసును ఒక్క

చూపులో ఆకర్షించావు? చెప్పవా? నన్ను చూడగానే నీకేమనిపించింతో నాకు తెలుసుకోవాలని ఉంది. తెలుపుతావు కదూ?

నాకు ఆశాభంగం కలిగించకు మరి!

నీకేమవుతానో తెలియని

కుసుమ.

"అమ్మో! ఈ ప్రేమలేఖ కుసుమరాసిందని స్పష్టంగా తెలిసిపోయింది!'' అంటూ మరో కాగితం తిప్పింది.

ప్రియతమా!

నీ లేఖ కోసం ఎదురు చూసి చూసి కన్నులు కాయలు కాచాయి. అవునులే-వెంటనే రాస్తే తేలికయి పోతాననుకున్నావా? బెట్టుచేస్తే విలువ ఎక్కువవుతుందను కున్నావా? లేక ఎట్లా రాయాలో తెలియటం లేదా? ఎన్నో సినిమాలు చూసే ఉంటావు. ఎన్నో నవలలు చదివే ఉంటావు. ప్రియతమా అని పిలిచిన అమ్మాయికి ఏం జవాబివ్వాలో తెలియక ఆలోచిస్తున్నావా? ప్రయత్నించు. ఇంకా తెలియక పోతే స్నేహితులనడుగు, అడగటానికి సిగ్గుగా ఉందా? సిగ్గేమిటి మగవాడికి?

మరినీ బెట్టుకూ నీ మౌనాన్నీ సహించలేని

కుసుమ

గుండె దడదడ కొట్టుకుంటూండగా కాగితాలన్నీ తిరగవేసి ఆఖరిది చూసింది.

ప్రియతమా!

నిన్ను కానక-కానలేక-వెర్రినై పోతున్నానోయీ. నా గుండెలోని అలజడిని నీవు గ్రహించలేవనుకోనా? ఆ అలజడి నీకు వినబడటం లేదనుకోనా! నా దురదృష్ట మనుకోనా? ఎందుకో అలా అనుకోలేక పోతున్నా. మన మధ్య ఎన్ని సముద్రాలు ఎన్ని పర్వతాలు-ఎన్ని నదీ నదాలున్నాయో కదా? లతా కుంజంలో ప్రేయసీ ప్రియులను పరవశింప చేయటానికి సంచరించే పరిమళాలను ఆఘ్రాణించటానికి రావా? అవరోధాలనన్నిటినీ అధిగమించి రాలేవా? వస్తావు వస్తావు. నాకు తెలుసులే-తప్పకుండా, వస్తావు.

నీకోసం నిరీక్షించే

కుసుమ

ఆ ఉత్తరాల కట్టను చూసి మొదట అదిరిపోయింది పేరిందేవమ్మ- కాని తరువాత తనలో తానే నవ్వుకుంది. రాసినవన్నీ తనదగ్గరే పెట్టుకుందేమిటి కట్ట కట్టి వీటన్నిటిని తీసి కాల్చేయాలా లేక యధాప్రకారం నోట్ బుక్‌లో పెట్టాలా? తనేంచేయాలిప్పుడు?

ఎట్లా ఆలోచించినా-తను రాసి, ఎవరికీ పంపకుండా ఉంచుకున్న ప్రమాద కరమైనవే ఈ లేఖలు.

పోనీ తీసి దాచిపెడితే ?

వెతుక్కొని కనబడకపోతే గొడవ చెయ్యదుకదా?

ఆమెకెటూ తోచక పుస్తకాల అడుగున కనబడకుండా వుండేటట్లు పెట్టింది.

సాయంకాలం నాలుగుగంటలకు కుసుమ గబగబా వచ్చి చీరె మార్చుకుని, 'బామ్మా టిఫిన్ టిఫిన్' అంటూ బల్లదగ్గరకొచ్చింది. ఆమె పెట్టిన ఉప్మా కాఫీ తీసుకుని, "బామ్మా ఇవాళ అయిదున్నర గంటలకు యూనియన్ మీటింగుంది. ఆలస్యం కావటానికి వీలులేదు. నేనే దానికి సెక్రెటరీని"

సంచీ చేతికి తగిలించుకుని "బామ్మా చెప్పులు ఎక్కడున్నాయి?" వెతకటం మొదలు పెట్టింది.

"రాగానే ఎక్కడ విడిచావు?''

"అవి కావు. వేరే రకంవి"

"ని గదిలో లేవా?"

''ఊఁ హుఁ. పొద్దున సంగీతం మాస్టారింటికి వేసుకువేళ్లాను."

రెండు నిమిషాలల్లో తీసుకువచ్చి "అక్కడ నుంచి రాగానే వరండాలో విడిచావు తీసుకో'' అంటూ తెచ్చి ఇచ్చింది పేరిందేవమ్మ.

"ఇవాళ్టికి బతికించావు బామ్మా" అంటూ కాళ్ళకు తగిలించుకుని'' నేను వెళ్తాను బామ్మా కొంచెం ఆలస్యమయితే గాభరాపడకు వచ్చేస్తాలే" పరుగుతీసింది.

పేరిందేవమ్మ చెట్లకు టూ బుతో నీళ్లు పోస్తూ ఆలోచిస్తోంది. కొడుకి,

ఉత్తరం రాస్తే? పరీక్షల ముందర వచ్చి తీసుకుపోతాడేమో? ఈ పరీక్షతో బి. ఏ. అయిపోతుంది.

'తను అట్లా ఉత్తరం రాస్తే కనక పిల్లను బజార్లో పెట్టినట్లవుతుంది. తన కొడుకు సామాన్యుడు కాదు. కాలేజికి వెళ్ళి ప్రిన్సిపాల్‌తో చెప్పి గొడవచేస్తాడు. తొందరపాటు మనిషి. ఈ విషయం తానే సరిదిద్దాలి కాని బైటికి పొక్కనివ్వ కూడదు.' అని నిశ్చయించుకుంది.

తెల్లవారిం తరువాత "ఎక్కడుంది ఆ కట్ట?" అని అడగక పోతుందా? అప్పుడు తను "ఏమిటవి? ఎవరికీ?" అని అడగవచ్చు ననుకుంది మనసులో.

పేరిందేవమ్మ రాత్రికి కుసుమకు వంటచేసి తాను చపాతీలు చేసుకుంది. తను ఎనిమిదింటికి గాని తినదు.

ఈ లోపల కుసుమ రావచ్చు. ఇప్పటికే ఆలస్యమైందనుకుంటూ టి. వి పెట్టింది. టి. వి లో భాగవతారిణి గొంతెత్తి హరికథ చెబుతోంది. ఆమె హరికథతో అనేకమయిన అధునాతన విషయాలను జోడించి ప్రేక్షకులను తన్మయులను చేస్తోంది. "ఈ రోజుల్లో అమ్మాయిలను పెంచటం పెద్దలకు క్లిష్ట సమస్యగా ఉంది పిల్లల ఆశలూ ఆశయాలూ అలవాట్లూ పెద్దవాళ్ళకు కంపరం పుట్టిస్తు న్నాయి. పెద్దవాళ్ళ అలవాట్లు ఆచారాలూ పిల్లలకు సంకటంగా ఉండి బాధ స్తమని పిస్తున్నాయి. పెద్దవాళ్లు వాటినన్నిటిని పిల్లల మీద రుద్దాలని చూడటం-పిల్లలు ఎదురు తిరగటం-ఇదండీ భాగవతం ఈ రోజుల్లో ఏ యింట్లో చూసినా, పెద్దలే తరం మారిందని కొంచెమయినా సర్దుకుంటే ఇళ్ళలో శాంతి నెలకుంటుంది. లేక పోతే రోజులు గడవ్వు" అంటూ మళ్ళీ హరికథలోకి దిగింది.

ప్రేక్షకులలో కొందరికి నవ్వు-కొందరికి 'ఈమె చెప్పాలా! ఇవన్నీ?" అన్న వెక్కిరింపు-

పేరిందేవమ్మకు భాగవతారిణి మాటలు ఆలోచనాంశాలయ్యాయి. ఎవరయినా ఒకరికి చెప్పటం సులభమనుకుంది.

ఎనిమిది కావచ్చింది. కుసుమరాలేదు. తన కాలస్యమయితే అరగదని పేరిందేవమ్మ చపాతీతిని పాలుతాగి కుసుమకు బల్లమీద పెట్టి మంచమ్మీదవాలింది.

కాని నిద్ర ఎట్లా వస్తుంది? ధ్యానమంతా ఉత్తరాల మీద-కుసుమ మీదా

ఉంది. లేచి భాగవతంలో ప్రహ్లాద చరిత్ర చదువుకుంది. ఓ అరగంటయిన తరువాత నిద్రరాకపోయినా పక్కమీద పడుకుంది.

రాత్రి పదకొండు గంటలవేళ ఇంటి ముందర స్కూటరు ఆగిన శబ్దం-టా టా అన్న మాటలూ-ఆ తరువాత తలుపు కొట్టిన శబ్దమూ అయింది.

ఎదురుచూస్తూ పడుకున్న పేరిందేవమ్మ దిగ్గున లేచి తలుపు తీసి "గంటెంతయిందే అమ్మాయీ?'' అడిగింది.

''ఎంతో కాలేదు బామ్మా. నీవు నిద్రలో ఉన్నట్టున్నావు. అందుకని ఎంతో టైమయినట్టు అనిపిస్తోంది. తొమ్మిది దాటిందో లేదో? అంతేబామ్మా. నీవు పడుకో, నేను అక్కడేవో తినొచ్చాను. బట్టలు మార్చుకుని దీపాలార్పుతాలే''

''అమ్మాయీ, అక్కడేదో తిన్నానంటావు కాని వాటితో కడుపు నిండుతుందా? బాగా తినాలి. బాగా చదివి పరీక్షలు రాయాలి. నాన్న మరీ మరీ చెప్పి వెళ్ళాడు."

ఆమెకు ఆ రాత్రి మరి నిద్ర పట్టలేదు. ఒకటే ఆరాటం. ఈ అమ్మాయి రాత్రి పదకొండు గంటల వేళ ఎవరి స్కూటర్ మీదనో ఇంటికి వస్తుందా? పైగా బామ్మకు టైమ్ తెలియదని తొమ్మిది దాటలేదంటూందా? ఇది చదువే చదువుతుందా-లేక ప్రణయ లేఖలే రాస్తుందా? ఏదో భాగవతారిణి చెప్పినట్టు పరీక్షలయిపోయే వరకూ సర్దుకు పోవటం తప్పనట్టుందనుకుంది. 'ఈ లోగా కుసుమ ఒక అడుగు ముందుకు వేస్తే'? ఆమెకు కళ్ళు మూతలు పడ్డాయి ఆలోచిస్తుంటే.

ఆ మరునాడు కాలేజీ లేదని పేరిందేవమ్మకు తెలియక, వేళకు మనమరాలికన్నీ అమర్చి పెట్టి, ఎదురు చూస్తోంది. ఆగలేక రెండుసార్లు పిలిచింది.

కుసుమలేచి స్నానంచేసి "బామ్మా, ఇవాళ కాలేజీ లేదు కాని-ఇద్దరు స్నేహితులు వస్తారు. నీవు కష్టపడి మళ్ళీ ఏం చెయ్యకు. నాకోసం చేసినవే సర్దుకుంటాం. వాళ్ళు రానీ"

"సర్దుకోవటం ఎందుకు? ఏదో చేస్తాను'' అంటూ గబగబా పూరీ కూర చేసింది-పెసరట్లతో సహా.

అంతలో వాళ్ళు వచ్చారు, పెసరట్లు పూరీ కూర కాఫీ గదిలోకి తీసుకెళ్ళి

తలుపేసుకుంది కుసుమ. కొంతసేపు కబుర్లూ-కొంతసేపు నవ్వులూ ఆ పైన పాటలూ మొదలు పెట్టారు.

పేరిందేవమ్మ ఆ పాటలేమిటో విందామని తలుపుకు దగ్గరగా కుర్చీ వేసుకుని కూర్చుంది.

కొంతసేపు రికార్డు పెట్టారు. ఆ తరువాత సంగీతం మొదలయింది. అది సంగీతమే గాని, చెవికింపైన మధురగానం కాదు. లలిత సంగీతమా అంటే అదీ కాదు. జానపద గేయాల వంటివీ కావు. దేశభక్తి గీతాలూ కావు. ధన్ దిన్ మంటూ చెవులు చిల్లులుపడే శబ్దాలు వాటికి తగినట్టుగా అడుగుల చప్పుడు.ఆ పాటలు ఆమెకు కర్ణకఠోరంగా అనిపించింది.

ఆమె అక్కడినుంచిలేచి వంటచేసి కుసుమకు బల్లమీద పెట్టి భోజనం చేసింది. పగలు ఒక గంటసేపు పడుకునే అలవాటామెకు.

అమ్మాయిలు పాడినంతసేపు పాడారు. అలసిపోయి బల్లమీద ఉన్న వంట కాలే సర్దుకుని భోజనాలు చేశారు. మళ్ళీ గదిలోకి వెళ్ళి కబుర్లలోపడి ఐదు గంటలకు ఇళ్ళకు చేరుకున్నారు.

కుసుమ స్నేహితులతో కాలక్షేపం చేసినా శ్రద్ధగా చదువుతున్నట్టు రాత్రి పదకొండు గంటల వరకూ బల్ల ముందర కూర్చుంటుంది, తెల్లవారి 'పరీక్షలకు చదువుతున్నా బామ్మా' అంటుంది

ఆ మరునాడు కాలేజినుంచి వస్తూనే "బామ్మా. నా గది పనిమనిషి ఎప్పుడు ఊడ్చింది?" అడిగింది ఆదుర్దాతో-

"పొద్దున ఊడ్చింది. ఈ పూట అది రాలేదు."

"నేను రాసిన కాగితాలకట్ట బల్లమీద పెట్టుకున్నాను. అవి కనబడటంలేదు."

"ఏం కాగితాలే అవి? పరీక్షకు పనికివచ్చే నోట్సా?"

"కాదు బామ్మా వేరే కాగితాలు. నెలరోజులనుంచీ చాల శ్రమపడిరాస్తున్నా. రాత్రంతా కూర్చుని మళ్ళీ రాశాను. పెద్ద కట్టయింది. ఇంకా ఆరు రాయాలి. అవి రాస్తే పూర్తయి పోతుంది కట్ట."

"ముఖ్యమైన నోట్సు కాబోలు. అంత కష్టపడి రాసిన దానవు అజాగ్రత్తగా ఎందుకు పెట్టుకున్నావు?''

"కాదు బామ్మా. అవి విడికాగితాలు కావు. వాటిని దారంతో కుట్టి ముడి వేశాను. ఆ కట్టమీద బరువైన పుస్తకం కూడా పెట్టాను. ఇప్పుడా కట్టే కనబడటంలేదు. వాటిని ఎంతో కష్టపడి రాశాను" కళ్ళు నీళ్ళ పర్యంతమయింది.

పేరిందేవమ్మకు కుసుమ మీద ఎనలేని మమకారం. అమ్మాయి కన్నీళ్లు పెట్టుకుంటే మనసు కరిగిపోతుంది. కుసుమను పొదివి పట్టుకుని "కుసుమా. ఇటు వంటి చిన్న చిన్న వాటికి ఏడుస్తావా? పెద్దదానవు కావటంలేదూ? ఎవరయినా చూస్తే నవ్వుతారు. నేను వెతికి పెడతానుండు . ఒక వేళ-బల్లమీదినుంచి కింద పడితే పనిమనిషి చెత్తబుట్టలో పడేసిందేమో చూద్దాం" కుసుమ కళ్ళు తుడిచి, బుట్ట తెచ్చి బోర్లా వేసింది. కాగితాలు కలిపివేసినవి కిందపడ్డాయి. వాటిలో కనబడక పోయేసరికి కన్నీళ్లు ఉబికి ఉబికి వస్తున్నాయి, కుసుమకు.

"ఎందుకే అంతబాధ పడతావు? నీవు రాసినవే కనుక మళ్ళీ రాయచ్చుగా? నోట్సు కాదంటున్నావు కనుక పరీక్షలయిన తరువాత నిదానంగా రాసుకుందువు గాని '

"అవి నేను రాసినవే కాని మళ్ళీ అలా రాయలేను. అందులోనూ ఒకటి రాసినట్టు ఇంకోటి రాయకుండా అతి జాగ్రత్తగా రాశాను. నా మనసంతా కరిగించి కలం దాంట్లో ముంచి రాశాను బామ్మా, మళ్ళీ అట్లాంటివి రాయగలనా?"

పేరిందేవమ్మకు ఒక పక్క కుసుమ అమాయకత్వానికి జాలి కలుగుతోంది. మరొకపక్క చేసినపని యొక్క పరిణామం ఎట్లా ఉంటుందోనన్న భయం కలుగుతోంది. వాటిని మరుగు పరచి గొల్లున నవ్వేసింది.

"చూడు కుసుమా, మనం తొందరలో వెతికితే కనబడదు నిదానంగా ఎప్పుడో అవే బయటపడుతాయి. ఇప్పుడా సంగతి మర్చిపో. పనిమనిషిరాగానే ఇల్లంతా సామాన్లుతీసి చూడమంటాను.

ఇంట్లో నుంచి ఒక్క కాగితమ్ముక్కయినా బైటికిపోదు. అంత జాగ్రత్తగా పని చేస్తుంది."

"బామ్మా, అవి చాలా ముఖ్యమైనవి. తప్పకుండా వెతకాలి. రేపు సాయంకాలం ఐదు గంటలకు గడువయిపోతుంది. మిగతావి కూడా రాసి ఆ కట్టలో పెడతాను. మొత్తం వందకావాలి. ఐదుగంటలు దాటితే నేను ఓడిపోతాను" మళ్లీ ఏడవటం మొదలు పెట్టింది.

"ఇంకా టైముంది కదా ? ముందు నీవు ఏడుపుముఖం కడుక్కో నేను చూడలేకుండా ఉన్నాను."

అంటూ బల్లమీద కుసుమకు కాఫీ టిఫిన్ పెట్టింది.

ముఖం కడుక్కుని వచ్చిన కుసుమ "బామ్మా, వెతుకుతానంటున్నావు కాని-అవి ఏంకాగితాలో నీకెలా తెలుస్తాయి" అన్నది.

"నీవు చెప్పావుగా కట్ట అని"

"అవును గాని బామ్మా నీ కసలు చదువటం వచ్చా?"

"నా కిన్నేళ్లొచ్చాయి. చదువు రాకపోయినా కాలం గడిచిపోతోందాలేదా?" నిజానికి ఆమెకు చదవటం వచ్చని చాలామందికి తెలియదు.

కుసుమ కడుపులో కాఫీ టిఫిన్ పడ్డ తరువాత ఆవేశం కొంత తగ్గింది.

"బామ్మా, మీ రోజుల్లో ప్రేమలేఖలు రాసుకోవటం ఉండా? నీవు తాతయ్యకు ఉత్తరాలు రాశావా?"

"ఎందుకు రాయలేదూ? ఎన్నో రాశాను. ఆ రోజుల్లో కూడా భార్యా భర్తల మధ్య ఉత్తరాలు నడిచేవి"

"నిజంగా?"

"ఆఁ! అంత ఆశ్చర్యపడతావేం? అయితే మేమిట్లా కాగితాలమీద రాసుకునే వాళ్ళం కాదు. నేను ఎక్కడికయినా వెళ్లేటప్పుడు నా కళ్ళల్లోనే రాసేదాన్ని. మీ తాతయ్య ఆ లేఖలను చదువుకుని అర్థం చేసుకునేవారు. ఊరినుంచి వచ్చిన తరువాత జరిగిన సంగతులన్ని మళ్లీ రాసేదాన్ని తలపంకిస్తూ చదువుకునేవారు"

"ఆ మూగ భాషేమిటి? చక్కగా కాగితాల మీద రాసుకోక?"

"చూడు కుసుమా? మనసులో ఉన్న భావాలను నోటితో వివరిస్తే ప్రేమ పలచబడి పోతుందన్న ఉద్దేశ్యంతో మనసే కళ్ళద్వారా వివరించే ఉత్తరాలు రాసుకున్నాం. వాటి విలువ ఎప్పటికీ తగ్గదు. కాగితం మీది కెక్కించే సరికి మనసులోని మమత పలచబడిపోతుంది. త్వరగా పాతవయి పోతాయి. మేము రాసుకున్న ఉత్తరాలున్నాయే అవి జన్మలో మరిచి పోలేనివి."

ఆమె మాటలకు కుసుమ గొల్లున నవ్వేసింది.

"బామ్మా, నీ సంగతి నా కర్థమయి పోయింది. నీకు చదువురాదు. రెండవది- పెద్దవాళ్ళ ముందర తాతయ్యతో మాట్లాడటానికి భయం. అందుకే కళ్ళతో చూసేదానివి. అంతేనా బామ్మా? ప్రేమంటూ ఉంటే కాగితమ్మీది కెక్కిస్తే వాటిని మళ్ళీ మళ్ళీ చదువుకోవచ్చు. తన్మయత్వం చెందవచ్చు. ప్రేమంటే అదొక మధుర భావన. అందలేనిదేదో అందుకోవాలన్న ఆరాటం. ఆ తహతహ రెండు వైపులా కలగాలి. ఎవరో ఒకరు ముందడుగువేసి సాధించాలి ఉత్తరాలతో. దాన్నే ప్రణయ మంటారు బామ్మా. ఆ ప్రణయం హృదయాన్ని అగ్నిలా కాల్చేస్తుంది. ఈ అగ్నిలాంటి ప్రణయం ఎదుటివారి హృదయాన్ని కరిగించి వేయాలి. కరిగిన హృదయాలు పరస్పరం కలుసుకోవటానికి లేఖలే ఆధారం. వాటికే ప్రణయ లేఖలంటారు. వాటిని ఎప్పుడు చదువుకున్నా హృదయం ఉప్పొంగి పోవాలి. వాటిని తలుచుకుని జీవితమంతా గడిపెయ్యవచ్చు. అదొక రాగమయ ప్రపంచం. ఇప్పుడర్థమయిందా ప్రణయ లేఖలంటే? అసలు ప్రణయమంటే ఎంత మందికి తెలుసు చెప్పు?''

"ఎందుకు తెలియదు ? ఎవరి స్థాయినిబట్టి వాళ్ళకు ప్రేమ కలుగుతుంది. బయటికి వ్యక్తం చేయటంలో తేడా ఉంటుంది. మానవుడికి కలిగే మనోవికారాలు అందరికీ కలుగుతాయి. బైటికి వ్యక్తం చెయ్యటానికి భావానికీ భాషకూ సంస్కారం కావాలి. కవులు చూడు. నీ వనే ప్రణయాన్ని ఎన్ని రకాలుగా వింత ఉద్రేకంతో రాస్తారో? చదువు రాని వాడికీ అంత ప్రేమా ఉంటుంది. కాని బహిర్గతం అంత మధురంగా సున్నితంగా సుందరంగా వ్యక్తం చేయలేడు."

"ఏమో బామ్మా, అందరికీ ప్రణయం ఉంటుందంటే నేను నమ్మను చదువు రాని వాళ్ళకు ప్రేమేమిటి?"

కుసుమ రాసిన ప్రేమ లేఖలు ఎవరినో ఉద్దేశించి రాసినవేనని పేరిందేవమ్మకు బాగా అర్థమయింది.

"సరే దీనికోసం మనం వాదులాడుకోవటం ఎందుకు ? చదువుకో, పరీక్షలు దగ్గరికొస్తున్నాయి."

పేరిందేవమ్మ పని చేస్తోంది గాని మనసులో మనసులేదు. ఈ పిల్ల చదువు తుందో లేక ప్రేమలోపడి కాలక్షేపం చేస్తుందో ఆమె కర్థంకావటంలేదు.

ఆ ఉత్తరాల కట్ట ఇవ్వకపోతే ఏడుస్తుంది. ఇస్తే ఏం చేస్తుందో? తెల్లవార్లూ ఇదే ఆలోచనలు.

మరునాడు కుసుమ కాలేజీకి వెళ్ళుతూ వెతకమని పేరిందేవమ్మకు చెప్పి మరీ వెళ్ళింది

మధ్యాహ్నం మూడు గంటల వరకూ ఆమె ఆలోచిస్తునే ఉంది ఆ కట్టను ఏంచెయ్యాలా అని. చివరకు ఇచ్చెయ్యటానికే నిశ్చయించుకుంది. కుసుమకు కనబడేటట్టు బల్లమీద పెట్టింది.

ఇంటికి రాగానే వాటిని చూసి 'అమ్మయ్య' అంటూ ఊపిరి పీల్చుకుని, తను రాసినవి కూడా ఆ కట్టలో చేర్చింది కుసుమ. మరునాడు—

"బామ్మా, నేను కొంచెం బజారుకెళ్ళి ఒక పుస్తకం కొనుక్కోవాలి. తొందరగా వచ్చేస్తాను. నా కోసం ఎవరయినా వస్తే కూర్చోమను"

కుసుమ వెళ్ళగానే ఆమె స్నేహితురాలు వచ్చింది.

''కుసుమ వస్తుంది కూర్చోమ్మా. బజారుకెళ్ళింది."

పేరిందేవమ్మకు ఆలోచన ఒకటి తటిల్లతలా మెరిసింది ఆ అమ్మాయిని చూడగానే.

"నీ పేరేమిటమ్మా" అంటూ ఆమె పక్కన కూర్చుని మాటల్లోకి దింపింది.

"నా పేరు సుమన.''

''ఇద్దరూ ఒక క్లాసేనా? మరెప్పుడూ నీవు రాలేదేం కుసుమ దగ్గరికి?"

"మేమిద్దరమూ ఒక క్లాసు కాదండీ, నేను ఎం. ఏ. చదువుతున్నాను. ఇద్దరం ఎప్పుడయినా కలుసుకుంటూ ఉంటాం కాలేజీలో."

"ఇప్పుడేమయినా పనుండి వచ్చావా? నేను కుసుమ బామ్మను"

"అవునండి. మేము వినోదం కోసం ఒక పందెం వేసుకున్నాం. ఇవాళ్టితో ఆ గడువు తీరిపోతుంది. అందుకని వచ్చాను."

"ఏం పందెం?"

''ఏదో మాటల్లో "నేను వంద ప్రేమలేఖలు రాస్తానని'' పందెం వేసింది నాతో. గెలిస్తే ఆమెకు నేను వందరూపాయ లివ్వాలి, ఓడిపోతే ఆమె నాకివ్వాలి''

గుండెలోని అలజడిని అణచుకోవటానికి ప్రయత్నిస్తోంది పేరిందేవమ్మ.

''నీవు గెలుస్తావనుకో ఆ లేఖల కట్టనేం చేస్తావు?"

"ఆఁ ఏంచేస్తాను? పందెం గుర్తుగా దాచిపెట్తాను"

"అమ్మాయీ, మీరు ఆడపిల్లలు ఆ లేఖల యొక్క పర్యవసానమేమిటో తెలియని చిన్న పిల్లలు. ఈ ప్రేమలేఖలు ఎవరిచేతిలోనయినా పడితే జీవితాలు నాశనమవుతాయి. మన సమాజం ఇటువంటి వాటిని హర్షించదు. మీ పందెంలో నీవే గెలుస్తావనుకో, కాని ఒక షరతు. మీ గెలుపూ ఓటమి తేల్చుకున్న తరువాత కుసుమకు తెలియకుండా ఆ కట్ట నా కందచేయాలి."

"నా కే మభ్యంతరం? ఇమ్మంటే ఇచ్చేస్తాను. ఏదో తమాషాకని వేసుకున్న పందెం బామ్మగారు."

ఇంతలో కుసుమ రానే వచ్చింది.

"హాయ్ సుమనా వచ్చావా? సరిగ్గా ఐదుగంటలయింది. నేను వంద రూపాయలు గెలుచుకున్నాను. నేను ఉత్తరాలకట్ట తెచ్చిస్తాను" సంతోషంతో లోపలికి వెళ్ళి తెచ్చింది కుసుమ.

"సరే-నేనే ఓడిపోయానని ఒప్పుకుంటున్నాను. ఇదిగో వందరూపాయల కాగితం తీసుకో'' ఇచ్చింది సుమన.

"నేనెంత కష్టపడ్డానను కున్నావు ఈ పందెం గెలవటానికి? సినిమాలు చూసిన అనుభవం-నవలలు చదివిన అనుభవం-అంతా ఉపయోగించి రాశాను-గెలిచాను'' సంతోషం కొద్దీ చప్పట్లు కొట్టింది కుసుమ.

"గెలుస్తావని తెలుసు నాకు. నీవు ఎవరికీ సాధ్యంకాని పనులు చేస్తావనీ తెలుసు. అబ్బ నీ తెలివి తేటలు అమోఘం" అంది సుమన నవ్వుతూ.

ఇద్దరూ కాఫీ టిఫిన్ తీసుకుని కాసేపు కబుర్లు చెప్పుకుని విడిపోయారు.

ఆ మరునాడు అనుకున్నట్టుగా పేరిందేవమ్మకు ప్రేమలేఖల కట్ట తెచ్చి చేతికిచ్చింది సుమన.

"నేను ఈ లేఖలు బయట పెడతాననుకున్నారా? నే నటువంటిదాన్ని కాను. మేమిద్దరం ఎప్పుడోగాని కలవం. ఈ మధ్య కలిసినప్పుడు ఎంతో సాహసంతో మాట్లాడింది. నేను కూడా 'ప్రణయలేఖలు రాయి చూద్దాం'అని పందెం వేసినప్పుడు నిజంగా రాస్తుందనుకోలేదు" అన్నది.

''అమ్మాయీ, నీమేలు మరిచిపోలేను" అమ్మాయి చేతిలో ఒక పండు పెట్టి సాగనంపింది పేరిందేవమ్మ.

కుసుమ చిన్నప్పటినుంచీ బామ్మ దగ్గరే పెరిగింది. అక్కడే చదువుకుంది. తల్లిదండ్రులు చుట్టాల మాదిరిగా చూసి పోయేవారు? ఈ సారి తండ్రి వచ్చి నప్పుడు సెలవులు కదా అని కుసుమను తీసుకు వెళ్ళాడు. నెలరోజులలోపల కుసుమకు ఒక ఇంజనీరుతో పెళ్లి నిశ్చయం చేశాడు.

కుసుమకు పెళ్ళి కొడుకు అన్ని విధాల నచ్చాడు.

పేరిందేవమ్మ అమితానందంతో పెళ్ళిపనులు చేస్తున్నది. కుసుమ పెళ్ళికి ఒప్పుకున్నందుకే ఆమెకు ఏనుగనెక్కినంత సంతోషంగా ఉంది.

పెళ్ళినాడు పెళ్ళివారితో పాటు రైలు దిగింది సుమన. ఆమె పెళ్ళికొడుకు పక్క పక్కనే తిరుగుతూ ఉండటం అందరూ చూశారు. ఎవరో 'ఆమె పెళ్లి కొడుకు చెల్లెలు' అన్నారు. ఆ మాటవిన్నది పేరిందేవమ్మ.

భోజనాల సమయంలో పేరిందేవమ్మ సుమనకు దగ్గరగా వచ్చి "బాగున్నావా అమ్మాయీ" అనడిగింది.

"మిమ్మల్ని మరిచి పోతానా బామ్మగారూ?" అని జవాబిచ్చింది సుమన నవ్వుతూ.

"అయితే మీ అన్నయ్యా పెళ్ళి కొడుకు? ఎంతమంది అన్నయ్యలునీకు?"

"ఒక్కడే నండీ, మిగతా వాళ్ళందరు చెల్లెళ్లు''

"అలాగా, సావకాశంగా భోజనం చెయ్యండి."

పెళ్ళి సక్రమంగా జరిగింది. పేరిందేవమ్మ వెయ్యి కళ్ళతో కుసుమను పెళ్లికొడుకునూ కనిపెడుతూనే ఉంది.

పెళ్ళి అవగానే పెళ్ళికొడుకు స్నేహితుడు "డెహరాడూన్‌కు రండి హనీమూన్‌కి" అని ఆహ్వానించాడు.

ప్రయాణమయ్యే నాడు "బామ్మా'' అంటూ వచ్చి ఆమె ఒళ్లో పడుకుంది. కుసుమ కళ్ళు తుడుచుకుంటూ.

"ఏం జరిగింది? పెళ్ళి కొడుకు ఏమయినా అన్నాడా? పొరబాటున నీ నీ ప్రేమలేఖల పందెం సంగతి అతడితో చెప్పావా? లేక సుమన చెప్పిందా? ఏమిటో ఏడుపు? అసలు సంగతి చెప్పు?'' లేవదీసి కూర్చో బెట్టుకుని బుజ్జగించింది పేరిందేవమ్మ.

కుసుమకు కళ్ళనీళ్ళు జల జల రాలుతున్నాయి.

''ఇంత ఆలస్యమేమిటి?" అంటూ పెళ్ళికొడుకు వచ్చాడక్కడికి.

''ఎందుకో ఏడుస్తు వచ్చింది. ఎందుకంటే చెప్పదు" అన్నది చెమ్మగిల్లిన కళ్ళతో పేరిందేవమ్మ.

''ఏం లేదండీ మా చెల్లెలితో పందెం వేసి గెలిచినట్టుకాదు-ప్రణయలేఖలు రాయటంలో నాతో పందెం వెయ్యమన్నాను. అందుకూ ఈ అలక" పగలబడి నవ్వుతున్నాడు పెళ్ళికొడుకు.

''బాబూ, కుసుమ వట్టి పిచ్చిది. నీకూ తెలిసింది కదా. అవి పందెపు ప్రేమలేఖలని? ఇవిగో బాబూ, ఆ కట్ట నేను తీసుకొన్నాను నీ కివ్వాలని" అంటూ అతడి చేతికిచ్చింది.

అతడు నవ్వుకుంటూ మరొకచేత్తో కుసుమ చెయ్యందుకున్నాడు.

"బామ్మగారూ, వీటిని చదివి చెబుతాను ఎవరుగెలుస్తారో?" కుసుమను తీసుకువెళ్లాడు

ప్రయాణం చేస్తున్నప్పుడు "నీ ప్రణయలేఖల కట్ట చాలా చిన్నది. నా దగ్గరున్న కట్ట చాలా పెద్దది'' అన్నాడు చేతిలో ఉన్న కట్టను చూపిస్తూ.

"మీరు రాసినవా అవి?"

"కాదు, నాకు వచ్చినవి. ఈ కట్ట ఎంత పెద్దదో తెలుసా? ఒక చిన్న హేండ్‌బాగ్‌లో పట్టగలిగినన్ని లేఖలు.''

"అమ్మో-అన్ని లేఖలే?" మూతిముడిచింది.

"అదిగో-అప్పుడే మూతిముడుచుకోకు. కేవలం ఉత్తరాలేగా? వాటికేనా ఇంత గునుపు?'' ఆమె చెయ్యి పట్టుకున్నాడు గట్టిగా. నవ్వుతూ.

"ఉత్తరాలయితే మాత్రం అంత పెద్ద కట్టా? ఎంత మంది దగ్గర్నుంచి?" ఆమె గుండెలో సన్నటి ముల్లు గుచ్చినట్లయింది.

❋❋